## అధ్యాయము 18

# అరణ్యములో ఉన్న మోషేతో యిత్రో యొక్క సందర్శన

"దేవుని పర్వతము" నొద్దకు ఇశ్రాయేలీయులు వచ్చిన తరువాత, మోషే యొక్క మామయైన యిత్రో మోషే భార్యయైన సిప్పోరా, మరియు వారి ఇద్దరు కుమారులైన గేర్షోము మరియు ఎలీయెజెరును వెంట పెట్టుకొని మోషేను చూడటానికి వచ్చాడు. మోషేతో యిత్రో యొక్క సందర్శనను నిర్గమకాండము 18వ అధ్యాయము వివరిస్తుంది (18:1-6).

మోషే మరియు యిత్రోలు పరస్పర క్షేమసమాచారములు తెలుపుకున్న తరువాత (18:7), యెహోవా ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తు నుండి విడిపించిన విధమును మరియు వారి ప్రయాణములో వారు ఎదుర్కొన్న విపత్కర పరిస్థితులను మోషే యిత్రోతో పంచుకున్నాడు (18:8). దీనిని వినిన యిత్రో, తన అల్లుడితో కలిసి ఆనందించి, యెహోవాను స్తుతించి మరియు ఆయనకు అర్పణలను తెచ్చాడు (18:9-12).

తరువాతి దినమున ప్రజలకు తీర్పు తీర్చుచూ దినమంతా కూర్చుని ఉన్న మోషేను యిత్రో గమనించాడు, ఈ క్రమము మోషేను అలాగే ప్రజలను కూడా అలసిపోయేటట్లు చేసింది (18:13). ఆ సాయంత్రం తన నాయకత్వపు విధానమును గూర్చి యిత్రో మోషేతో మాట్లాడాడు. ప్రజల పక్షమున దేవుని సన్నిధిలో విజ్ఞాపన చేయుటకును మరియు ప్రజలకు ధర్మశాస్త్రమును బోధించుటకును ఆయన యొక్క విధిగా చేసికొనునట్లు యిత్రో మోషేను బ్రతిమాలాడు. కాని, చిన్న చిన్న వివాదములను తీర్చుటకు గాను కొంత మంది మంచివారగు మనుష్యులను నియమించి, చాలా క్లిష్టమైన వివాదములను మాత్రమే మోషే తీర్చునట్లు చేసికొనమని కూడా సూచించాడు (18:14-23).

మోషే తన మామ ఇచ్చిన సలహాను తీసుకున్నాడు (18:24-26). అప్పుడు మోషే "తన మామను పంపివేయగా" యిత్రో తన సొంత దేశమునకు తిరిగి వెళ్లెను (18:27).

## మోషే యొద్దకు యిత్రో యొక్క ఆగమనము (18:1-7)

**[1]దేవుడు మోషేకును తన ప్రజలైన ఇశ్రాయేలీయులకును చేసినదంతయు, యెహోవా ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి వెలుపలికి రప్పించిన సంగతియు. మిద్యాను యాజకుడును మోషే మామయునైన యిత్రో వినినప్పుడు [2]మోషే మామయైన యిత్రో తనయొద్దకు పంపబడిన మోషే భార్యయైన సిప్పోరాను ఆమె యిద్దరి కుమారులను తోడుకొని వచ్చెను. [3]అతడు - అన్యదేశములో నేను పరదేశిననుకొని వారిలో ఒకనికి గేర్షోము అని పేరు పెట్టెను. [4]- నా తండ్రి దేవుడు నాకు సహాయమై ఫరో కత్తివాత నుండి నన్ను తప్పించెననుకొని రెండవవానికి ఎలీయెజెరని పేరు పెట్టెను. [5]మోషే మామయైన యిత్రో అతని కుమారులనిద్దరిని అతని భార్యను తోడుకొని అరణ్యములో దేవుని పర్వతము దగ్గర దిగిన మోషేయొద్దకు వచ్చెను. [6] - యిత్రో అను నీ మామయైన నేనును నీ భార్యయు ఆమెతో కూడ ఆమె యిద్దరు కుమారులును నీ యొద్దకు వచ్చియున్నామని మోషేకు వర్తమానము పంపగా [7]మోషే తనమామను ఎదుర్కొన పోయి వందనము చేసి అతని ముద్దు పెట్టుకొనెను. వారు ఒకరి క్షేమము ఒకరు తెలిసికొని గుడారములోనికి వచ్చిరి.**

**వచనము 1.** "దేవుని పర్వతము" (18:5) దగ్గర, అంటే హోరేబు లేదా సీనాయి పర్వతము (3:1; 4:27; 24:13) మోషే ఒక సందర్శకుని స్వీకరించాడు. ఆయన **మామయైన యిత్రో**, వేరొక చోట రగూయేలు అని కూడా పిలువబడ్డాడు (2:18; 3:1; 4:18), ఆయనను కలుసుకొనుటకు వచ్చాడు. ఈ పుస్తకము మొదటి భాగములో మోషే ఐగుప్తునుండి పారిపోయి ఒక చోట ఆశ్రయమును, ఒక భార్యను మరియు అతని కొరకు ఒక పనిని పొందుకున్న ఆ కథనములో కూడా ఈయన పేరు వచ్చింది. **మిద్యాను యాజకునిగా** యిత్రో ఏకైక నిజమైన దేవుడైన యెహోవాను ఆరాధించి ఉంటాడు. దేవుడు **మోషేకును మరియు ఇశ్రాయేలీయులకును చేసినదంతయు** ఆయన **విన్నాడు** గనుక యిత్రో వచ్చాడు. ఇశ్రాయేలు ప్రజలను తన శక్తిగల విమోచనతో విడిపించిన ఘటన ద్వారా దేశములు ఆయనను "తెలిసికొన" వలెనన్న దేవుని యొక్క ప్రణాళిక పని చేస్తుంది.

**వచనము 2. మోషే భార్యయైన సిప్పోరాను యిత్రో** తనతో కూడా తీసుకొని వచ్చాడు. మోషే **ఆమెను పంపాడు** అని ఇక్కడ పాఠ్యము చదువరికి తెలుపుతుంది, కాని ఎప్పుడు ఎందుకు ఆయన అలా చేశాడు చెప్పలేదు. חָלַשׁ (*shalach*) అను పదము "పంపి . . . వేశాడు" అని అనువదించబడింది, ఈ పదము తరువాతి కాలములో పాతనిబంధనలో విడాకులకు ప్రయోగించబడింది. ఇక్కడ దీనిని మధ్యస్థ అర్థములో, 18:27లో యిత్రో నిర్గమమును గూర్చి మాట్లాడిన సందర్భములోవలే, ప్రయోగించడమైనది.[1]

సిప్పోరాను మునుపు 4:24-26లో, "రక్తసంబంధమైన పెనిమిటి" నేపథ్యంలో ప్రస్తావించారు గనుక, అక్కడి నుండి ఆమెను మరియు ఇద్దరు కుమారులను ఆమె తండ్రియైన యిత్రో వద్దకు మోషే పంపివేశాడు అని చాలా మంది పండితులు

ఆలోచించారు. ఆయనకియ్యబడిన ఆ పని ఎంతటి కఠినమైనదో అని ఆయన ఎరిగాడు గనుక తన కుటుంబమును కాపాడాలని అనుకున్నాడు. మరొక సాధ్యమగు విషయమేమంటే సిప్పోరా మోషేతో కూడా ఐగుప్తులో ఉండి నిర్గమమును అనుభవించింది, కాని వారి విమోచనను గూర్చి యిత్రోకు నివేదిక ఇవ్వడానికి మోషే ఆమెను ఇటీవలే యిత్రో వద్దకు పంపి ఉంటాడు అనే వాదన.

**వచనములు 3, 4.** యిత్రో మరియు ఆయన కుమార్తెయైన సిప్పోరాలతో **ఆమె ఇద్దరు కుమారుల** కూడా వచ్చారు. మొదటి కుమారుని పేరు **గేర్షోము**, దీని అర్థము "అక్కడ ఒక పరదేశి." **నేను అన్యదేశములో పరదేశినై యుంటిని** అని మోషే చేసిన ప్రకటన వలన ఈ పేరు ఇవ్వబడింది (2:22పై గల వ్యాఖ్యలను చూడండి). రెండవ కుమారుడు, ఈయన ఈ పుస్తకములో మునుపు పేర్కొనబడలేదు, ఆయన పేరు **ఎలీయెజెరు**, అంటే దీని అర్థము "నా దేవుడు సహాయకుడు." **నా తండ్రి దేవుడు నాకు సహాయమై ఫరో కత్తివాత నుండి నన్ను తప్పించెను** అని మోషే చేసిన ప్రకటనపై ఈ పేరు ఆధారపడి ఉంది.

**వచనములు 5-7.** ఆయన అక్కడకు రావడానికి మునుపే చేరునట్లుగా ఒక వర్తమానము ద్వారా తన రాక యొక్క ఉద్దేశమును **మోషే మామ** ప్రకటించాడు. యిత్రో ఇశ్రాయేలీయుల యొక్క శిబిరము వద్దకు మోషే **భార్యను** మరియు ఇద్దరు **కుమారులను** తీసికొని వచ్చినప్పుడు, ఆయనను చూచుటను బట్టి మోషే ఆనందించి, సాధారణ పద్ధతిలో అనగా ఆయనకు నమస్కారము చేసి ఆయనను ముద్దుపెట్టుకొనుట ద్వారా ఆయనను ఆహ్వానించాడు. అప్పుడు మోషే యిత్రోను తన **గుడారము**లోనికి ఆహ్వానించాడు.

ఈ సందర్శనమును గూర్చియు మరియు దాని ఫలితమును గూర్చియు కలుగు వేధించే ప్రశ్న ఏమనగా, "ఇది ఎప్పుడు జరిగినది?" పాఠములో దీని స్థానమును బట్టి చూస్తే అమాలేకీయులతో యుద్ధము జరిగిన తరువాత మరియు సీనాయి పర్వతముపై ధర్మశాస్త్రమును ఇచ్చుటకు మునుపు ఇది జరిగినట్లుగా తెలుస్తుంది. కాని, నిర్గమ. 18వ అధ్యాయము నిజానికి కాలక్రమమును తప్పి ఇక్కడ ఇవ్వబడింది అని వ్యాఖ్యాతలు తరచూ అభిప్రాయపడుతుంటారు. పరిశుద్ధ గ్రంథపు కథనములు ఎల్లప్పుడూ కూడా ఒక నిర్దిష్టమైన కాలక్రమ పద్ధతిలో వ్రాయబడినవి అయితే కావు. నిర్గమకాండములో ఆఖరు తెగులు సంభవించినప్పుడు మరియు పస్కాను ఒక వ్యవస్థగా నిశ్చయించిన క్రమములో ఇది మరింత స్పష్టమవుతుంది. సాధ్యమగు రెండు ఆలోచనలు ఇక్కడ మనము గమనించాలి.

1. "కట్టడలు" మరియు "ధర్మశాస్త్రములు" అనేవాటి ప్రస్తావన యిత్రో యొక్క సందర్శనము ధర్మశాస్త్రమును ఇచ్చిన తరువాతనే జరిగినట్లుగా సూచిస్తుంది.[2] "దేవుని కట్టడలను ఆయన ధర్మశాస్త్రవిధులను వారికి తెలుప"డం నా విధి (18:16) అని మోషే చెప్పాడు, మరియు "ఆయన కట్టడలను ధర్మశాస్త్ర విధులను బోధించు" అని యిత్రో మోషేతో అన్నాడు (18:20). కాబట్టి, మోషే అప్పటికే ధర్మశాస్త్రమును స్వీకరించాడు అని ఇక్కడ తెలుస్తుంది. ఈ వ్యాఖ్యానమునకు అనుకూలంగా ఉన్న మరోక విషయం ఏమంటే ఈ సంఘటన **దేవుని పర్వతము** (18:5) దగ్గర, లేదా

సీనాయి పర్వతము దగ్గర సంభవించింది. ఇంకా చూస్తే, ఈ కథనమునకు పూర్వము మనము చూచిన "ప్రయాణ కథ"ల శైలిలో ఇక్కడి కథనము లేదు, ఆ కథనములు ఇశ్రాయేలీయుల యొక్క ప్రయాణమును మరియు క్రొత్త స్థలములో వారి ఆగమనమును తెలుపుతాయి. (19వ అధ్యాయములో నిబంధనను చేసికొనుటను గూర్చి ఉన్న కథనమునకు కూడా ఈ గుణాలు ఉన్నాయి.)

ఒకవేళ ఇక్కడ చెప్పబడిన సంఘటన కాలక్రమమునకు చెందినది కాకున్న యెడల - అనగా, ప్రత్యక్ష గుడారము కట్టబడుచుండగా ఇశ్రాయేలు ప్రజలు సీనాయి వద్ద గడిపిన ఒక సంవత్సర కాలములో ఇది జరిగియున్న యెడల - ఈ దశలో ఈ కథనములో ఇది ఎందుకు చేర్చబడింది? దీనికి ఇవ్వబడే స్పష్టమగు జవాబు ఏమంటే ఈ కథనమును తరువాత భాగములో చేర్చుటకంటే ఇక్కడ ఇవ్వడమే రచయిత ప్రణాళికకు తోచినది అని. ఆ ప్రణాళిక ఏమిటి అనేది తెలుసుకోవడం ఖచ్చితంగా చాలా కష్టం. దేవుడు ఇశ్రాయేలు యొక్క అవసరతలకు ఏ విధంగా సమకూర్చాడో అనే విషయముపై మరింతగా ఋజువులను ఇవ్వడానికి ఇక్కడ చేర్చబడి ఉంటుంది. ఆయన వారికి విమోచనను, (మేఘము మరియు అగ్ని ద్వారా) నడిపింపును, నీళ్లను, ఆహారమును, మరియు (శత్రువులపై జయము ద్వారా) భద్రతను ఇచ్చాడు. ఈ సంఘటనను చెప్పుట ద్వారా, తన ప్రజలకు దేవుడు ఒక వ్యవస్థను కూడా ఇచ్చాడు అని పాఠ్యము తెలుపుతుంది.

ఈ కథనమును ఇక్కడ చేర్చుటకు గల కారణములను రెండింటిని Nahum M. Sarna అనే రచయిత ఇచ్చాడు. మొదటిగా, ఈ కథనము ఇప్పటి వరకు తీసుకుంటున్న గజిబిజి గతిలో "ఆందోళన నుండి బాగా అవసరమైన ఉపశమనము"ను ఈ నివేదిక ఇస్తుంది. రెండవదిగా, ఈ అధ్యాయము మొదటి భాగములో మిద్యానీయులకు (లేదా కేనీయులకు) మధ్యగల సద్భావ సంబంధములు ఈ కథనమును 17వ అధ్యాయములో అమాలేకీయుల యొక్క వక్ర బుద్ధి గూర్చి చెప్పిన కథనముతో ముడిపెడుతున్నాయి మరియు వాటికి విరుద్ధముగా కూడా చూపుతున్నాయి. అలాగే, ఈ అధ్యాయము తరువాతి భాగములో "కట్టడలు మరియు ధర్మశాస్త్రవిధుల"పై (18:20) ఉన్న ఉద్ఘాటన 19వ అధ్యాయములో పరిచయం చేయబడబోతున్న నిబంధన మరియు ధర్మశాస్త్రములకు ఒక వారధిగ కూడా పనిచేస్తుంది.[3]

2. సీనాయి పర్వతము మీద ధర్మశాస్త్రమును ఇవ్వడానికి ముందు యిత్రో యొక్క సందర్శనము జరిగి ఉంటుంది. మోషే ఒకవేళ పది ఆజ్ఞలను పొందుకొనకుండా ఉన్నట్లయితే, అప్పుడు "కట్టడలు మరియు ధర్మశాస్త్రవిధులు" అనే మాటలు దేవునిచే ఇవ్వబడిన ధర్మశాస్త్రములనే సూచిస్తున్నాయి తప్ప లిఖితపూర్వకమైన ధర్మశాస్త్రములను కాదు. "కట్టడలు మరియు ధర్మశాస్త్రవిధులు" అనే మాటలకు "ఇంకా ఇవ్వబడని ధర్మశాస్త్రమునకు ఏమి సంబంధం లేదు కానీ, దేవుని ఆజ్ఞ మేరకు అప్పటికే ప్రజలతో మోషే చెప్పిన నియమ నిబంధనల సముదాయమునకు సంబంధం ఉంది"[4] అని James Burton Coffmann ప్రతిపాదిస్తూ ఈ ఆలోచనకు మద్దతునిచ్చాడు. మరొక విధంగా చెప్పాలంటే, మోషే ధర్మశాస్త్రమును స్వీకరించుటకు

మునుపు ఈ సంఘటన జరిగియున్న యెడల, ఆ సమయములో దేవుని చిత్తమును గూర్చి ఆయన తెలిసికొనియున్న సమాచారము ఆధారముగా ప్రజలకు న్యాయము తీర్చుచుండి ఉంటాడు. తరువాత, "కట్టడలు మరియు ధర్మశాస్త్రవిధులు" మరింత విపులంగా సీనాయి పర్వతము వద్ద ఇవ్వబడతాయి.

మరొక సాధ్యము ఏమంటే ఈ భావన "పూర్వగామి," అంటే రాబోవుతున్న దాని గూర్చి అప్పటికే సంభవించినట్లుగా మాట్లాడే ఒక రచనా శైలి. ఈ "పూర్వగామి" ప్రయోగమునకు ఇతర ఉదాహరణలు నిర్గమకాండము మొదటి భాగములో, "ఆజ్ఞలు," మరియు "కట్టడలు" (15:26) మరియు "ఉపదేశము" (*torah*, లేదా "ధర్మశాస్త్రము"; 16:4) అనునవి వాస్తవముగా ధర్మశాస్త్రము ఇవ్వబడటానికి మునుపు ప్రస్తావించబడినవి.

## దేవుని విమోచనను బట్టి యిత్రో ఆనందించడం (18:8-12)

**[8]తరువాత మోషే యెహోవా ఇశ్రాయేలీయుల కొరకు ఫరోకును ఐగుప్తీయులకును చేసినదంతయు, త్రోవలో తమకు వచ్చిన కష్టము యావత్తును, యెహోవా తమ్మును విడిపించిన సంగతియు తన మామతో వివరించి చెప్పెను. [9]యెహోవా ఐగుప్తీయుల చేతిలోనుండి విడిపించి ఇశ్రాయేలీయులకు చేసిన మేలంతటిని గూర్చి యిత్రో సంతోషించెను. [10]మరియు యిత్రో - ఐగుప్తీయుల చేతిలోనుండియు ఫరో చేతిలోనుండియు మిమ్మును విడిపించి, ఐగుప్తీయుల చేతిక్రిందనుండి ఈ ప్రజలను విడిపించిన యెహోవా స్తుతింపబడునుగాక. [11]ఐగుప్తీయులు గర్వించి ఇశ్రాయేలీయుల మీద చేసిన దౌర్జన్యమునుబట్టి ఆయన చేసినదాని చూచి, యెహోవా సమస్త దేవతలకంటె గొప్పవాడని యిప్పుడు నాకు తెలిసినదనెను. [12]మరియు మోషే మామయైన యిత్రో ఒక దహనబలిని బలులను దేవునికర్పింపగా అహరోనును ఇశ్రాయేలీయుల పెద్దలందరును మోషే మామతో దేవుని సన్నిధిని భోజనము చేయవచ్చిరి.**

**వచనము 8.** ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తు దేశము నుండి విడిపించుటకుగాను **యెహోవా చేసినదంతయు**, అనగా ఎఱ్ఱ సముద్రము నుండి, త్రోవలో తమకు **వచ్చిన కష్టము యావత్తును మోషే** యిత్రోతో చెప్పాడు. ఈ కష్టాలు ఏవనగా వారు ఎదుర్కొన్న ఆహారలేమి నీటిలేమి, అలాగే అమాలేకీయులచే వారు దాడి చేయబడటం.

**వచనములు 9-11a. యిత్రో** సంతోషించాడు. **దేవుని** మహిమపరచుటకు మరియు ఆయన గొప్పతనమును ప్రకటించుటకు దేవుడు చేసిన కార్యములను వర్ణించుటకు మోషే ఉపయోగించిన పదములనే మరలా ఉపయోగించాడు. **యెహోవా సమస్త దేవతల కంటే గొప్పవాడని** అతడు తరువాత ఒప్పుకున్నాడు. John I. Durham ఇలా అన్నాడు, ". . . యిత్రో మునుపు *నమ్మినట్లే* యెహోవా దేవతలందరి కంటే గొప్పవాడని ఇప్పుడు కూడా నమ్ముతున్నాడు అను విషయం ఈ కథనములో ఇమిడియుంది. యెహోవా ఇతర దేవతల కంటే గొప్పవాడని అతడు నిజముగా నమ్మాడు. ఇప్పుడు తాను నమ్మినది నిజమను నిర్ధారణ అతనికి కలిగింది."[5] ఇశ్రాయేలు మతమునకు

తరువాత ఒక లక్షణమైన ఏకదైవ తత్వమును యిత్రో మాటలు ప్రతిబింబించుట లేదు, ఎందుకంటే ఏకదైవ తత్వము అంటే ఒకే దేవుని నమ్మి మిగిలిన వాటిని తిరస్కరించుట. అయితే, యిత్రో యొక్క కథనము monolatry లేక henotheismను చూపిస్తుంది. Monolatry అంటే ఇతర దేవతలు ఉన్నారని నమ్మినప్పటికీ, ఆరాధనకూ యోగ్యుడైన *ఒక్క* దైవమును మాత్రమే ఆరాధించుట. Henotheism అనునది ఒక దేవుని నమ్ముటయే గాని, ఆరాధనకు యోగ్యులైన *ఇతరులు* కూడా ఉన్నారని నిరాకరించకపోవుట. అనేకులలో గొప్పవాడు లేక అనేక దేవతల మధ్యలో ఒకరి ఆరాధనను చూపిస్తుంది.

**వచనము 11b.** 11వ వచనము యొక్క రెండవ భాగము మరింత కష్టమైనది. **వారు ఇశ్రాయేలీయుల మీద చేసిన దౌర్జన్యమునుబట్టి** అని లేఖనము చెబుతున్నప్పుడు, అది ఐగుప్తీయుల దేవతలను గూర్చి మాట్లాడుతుంది, మరియు ఆ దేవతలు ఇశ్రాయేలీయులతో అహంకారముగా వ్యవహరించారనే ఆలోచనను వ్యక్తపరుస్తున్నాయి (చూడండి NRSV; NIV; CEV). Durham అనువదించాడు, "వారు ఇశ్రాయేలీయుల మీద దౌర్జన్యము చేశారు" మరియు ఐగుప్తీయుల దేవతలు "యెహోవా ప్రజలైన ఇశ్రాయేలీయులకు విరోధంగా వ్యవహరించుట వలన యెహోవాపై తిరుగుబాటు చేశారు."[6] "యెహోవా దేవతలందరి కంటే గొప్పవాడు అంటే ఐగుప్తీయులు ఇశ్రాయేలీయులపై అహంకారము చూపిన విషయాలలో ఖచ్చితముగా ఆయన గొప్పవాడు"[7] అనే అర్థమును ఇస్తుంది అని W. H. Gispen చెప్పాడు. ఐగుప్తు దేవతలు ఇశ్రాయేలు మీద "దౌర్జన్యము" చేసెనను వర్ణన ఇశ్రాయేలీయులతో ఫరో (ఇతడు ఐగుప్తు దేవతలలో ఒకనిగా పరిగణించబడ్డాడు) మరియు ఆ దేవతలను ఆరాధించిన ప్రజలు చేసిన దుర్వ్యవహారమును సంబోధిస్తుంది. 10:3 ప్రకారం, దేవుని యెదుట వినయ మనస్కుడు కాకపోవుట ఫరో చేసిన పాపము. మరొక మాటలో, అతడు అహంకారిగాను గర్విష్టునిగాను ఉన్నాడు.

**వచనము 12. అప్పుడు యిత్రో . . .** దేవునికి బలులు అర్పించెను. అతడు దహన బలిని అర్పించాడు, మరియు ఆ అగ్నిలో ఆ జంతువు అంతా కాల్చబడింది. మరియు అతడు, తరువాత దినాలలో "సమాధానార్థ బలులు" అని పిలువబడిన **బలులు** కూడా అర్పించాడు, ఈ బలిలో కొంత భాగము బలిపీఠం యొద్ద అర్పించి మిగిలిన భాగమును ఆరాధికులు తినేవారు.[8] ఈ బలి పలు ప్రశ్నలకూ దారితీసింది.

1. యిత్రో స్వయంగా తానే బలులు అర్పించాడా? לָקַח (*laqach*) అను హెబ్రీ పదము "తీసుకొనుట" (NASB; KJV; NKJV) అని అనువదించబడింది, ఇది సందిగ్ధత కలిగి అట్టి సాధ్యతకు అవకాశం ఇస్తుంది గాని, దానిని కోరుకొనదు. కొన్ని అనువాదాలు ఈ క్రియా పదమును "తీసుకొనివచ్చుట" అని అనువదిస్తాయి (NRSV; NIV; REB; NAB), మరికొన్ని "అర్పించుట" అని అనువదిస్తాయి (NJB; CEV). యిత్రో స్వయంగా తానే బలులను అర్పించియుండవచ్చు, లేక అతడు ఆ బలియార్పణ కొరకు మరియు తరువాత భోజనము కొరకు అక్కడ ఉన్నప్పటికీ, వేరొకరు బలి అర్పించుటకు అతడు జంతువులను తెచ్చియుండవచ్చు.

2. ఒకవేళ యిత్రో స్వయంగా బలులు అర్పించియుంటే, ఆయన ఏ అధికారంతో

వాటిని ఇచ్చాడు? అప్పటికీ మోషేకూ ధర్మశాస్త్రము ఇవ్వబడనప్పటికీ, ధర్మశాస్త్రము ఇచ్చుటకూ మునుపు కాలంలో కూడా బలులు అర్పించేవారు. ఒక కుటుంబ పెద్దగా, మిద్యాను యాజకునిగా, మరియు ఒక ఘనమైన అతిథిగా, అతడు కోరిన యెడల స్వయంగా బలులు అర్పించు ధన్యత యిత్రోకు దక్కియుండవచ్చు.[9]

3. ఈ బలులు అర్పించుట యిత్రో కేవలం యెహోవా దేవుని యొక్క విశ్వాసి మాత్రమే అని నిర్ధారిస్తుందా? లేదు, పురాతన సమీప తూర్పులో బలమైనవిగా పరిగణించబడిన దేవతలను గౌరవించుట మరియు ఒక దేవుని గూర్చి (ఆరాధన సమయంలో) తానే ఏకైక దేవుడని చెప్పుట కూడా ఒక ఆనవాయితీగా ఉండేది.[10] అయితే, ఇంతకుముందు తెలుపబడినట్లు, యిత్రో యెహోవాకు నిజమైన విశ్వాసి కూడా అయ్యుండవచ్చు. ఇంతకుముందు అతడు కాకపోయినా, ఈ సందర్భములో - తన ప్రజలైన ఇశ్రాయేలు కొరకు యెహోవా చేసిన కార్యములన్ని వినిన తరువాత - అతడు అద్వితీయ సత్య దేవునికి విశ్వాసి అయ్యుండవచ్చు.[11]

బలులు అర్పించిన తరువాత, యిత్రో **అహరోను మరియు ఇశ్రాయేలీయుల పెద్దలందరితోను భోజనము చేసెను**. ఈ భోజనములో మోషే ప్రస్తావించబడలేదు గాని అతడు కూడా ఉండియుండవచ్చు. భోజనములో పాలుపంచుకొనుట ప్రాముఖ్యమైన విషయం కావచ్చు. ఈ బలులు, ఒకవేళ వాటిని సమాధానార్థమైన బలులని అనుకొంటే, ఆహారము కొరకు కావలసిన మాంసమును ఇచ్చాయి. పెద్దలందరు పాలుపంచుకొన్నారు కాబట్టి, మరియు పెద్దలు "ఇశ్రాయేలు ప్రజలందరికీ ప్రతినిధులుగా ఉన్నారు కాబట్టి,"[12] ఒక విధంగా ఇశ్రాయేలు "అంతా" అక్కడ హాజరైనట్లుగా ఉంది.

అంతేగాక, వారు **దేవుని యెదుట** భోజనము చేశారు, కాబట్టి దీనిలో ఒక ప్రత్యేక ఉద్దేశము ఉందని ఇది సూచిస్తుంది. తరువాత కాలములో దేవుడు ఇశ్రాయేలీయులతో చేసిన నిబంధనల ప్రక్రియలో భోజనము ఒక భాగమైనట్లు (24:11), ఆ ఉద్దేశము ఇద్దరు ప్రజల మధ్య - యిత్రో ప్రజలు మరియు ఇశ్రాయేలీయుల మధ్య - ఒక నిబంధన స్థిరపరచుట కావచ్చు.[13] ఈ భోజనము ఈ ఇద్దరి ప్రజల మధ్య ఒక నిబంధనను స్థాపించినట్లైతే, కయీనీయులు మరియు ఇశ్రాయేలీయుల మధ్య తరువాత ఏర్పడిన మంచి సంబంధాలను వివరించుటకు ఇది సహాయపడుతుంది (న్యాయాధి. 4:11-22; 1 సమూ. 15:6). కయీనీయులు మోషే మామ వంశమైన మిద్యాను కుటుంబమునకు చెందినవారు (న్యాయాధి. 4:11).

## మోషేకు యిత్రో ఇచ్చిన సలహా (18:13-27)

**[13]మరునాడు మోషే ప్రజలకు న్యాయము తీర్చుటకు కూర్చొండగా, ఉదయము మొదలుకొని సాయంకాలమువరకు ప్రజలు మోషే యొద్ద నిలిచియుండిరి. [14]మోషే ప్రజలకు చేసినదంతయు అతని మామ చూచి నీవు ఈ ప్రజలకు చేయుచున్న యీ పని ఏమిటి? ఉదయము మొదలుకొని సాయంకాలమువరకు నీవు మాత్రము కూర్చొండగా ప్రజలందరు నీయొద్ద నిలిచియుండనేల అని అడుగగా [15]మోషే దేవుని తీర్పు**

**తెలిసికొనుటకు ప్రజలు నా యొద్దకు వచ్చెదరు. [16]వారికి వ్యాజ్యెము ఏదైనను కలిగినయెడల నా యొద్దకు వచ్చెదరు. నేను వారి విషయము న్యాయము తీర్చి, దేవుని కట్టడలను ఆయన ధర్మశాస్త్ర విధులను వారికి తెలుపుచున్నానని తన మామతో చెప్పెను. [17]అందుకు మోషే మామ అతనితో నీవు చేయుచున్న పని మంచిది కాదు; [18]నీవును నీతో నున్న యీ ప్రజలును నిశ్చయముగా నలిగిపోవుదురు; ఈ పని నీకు మిక్కిలి భారము, అది నీవు ఒక్కడివే చేయచాలవు. [19]కాబట్టి నా మాట వినుము. నేను నీకొక ఆలోచన చెప్పెదను. దేవుడు నీకు తోడైయుండును, ప్రజల పక్షమున నీవు దేవుని సముఖమందు ఉండి వారి వ్యాజ్యెములను దేవుని యొద్దకు తేవలెను. [20]నీవు వారికి ఆయన కట్టడలను ధర్మశాస్త్ర విధులను బోధించి, వారు నడవవలసిన త్రోవను వారు చేయవలసిన కార్యములను వారికి తెలుపవలెను. [21]మరియు నీవు ప్రజలందరిలో సామర్థ్యము దైవభక్తి సత్యాశక్తి కలిగి, లంచగొండులుకాని మనుష్యులను ఏర్పరచుకొని, వేయిమందికి ఒకనిగాను, నూరుమందికి ఒకనిగాను, ఏబదిమందికి ఒకనిగాను, పదిమందికి ఒకనిగాను, వారి మీద న్యాయాధిపతులను నియమింపవలెను. [22]వారు ఎల్లప్పుడును ప్రజలకు న్యాయము తీర్చవలెను. అయితే గొప్ప వ్యాజ్యెములన్నిటిని నీయొద్దకు తేవలెను. ప్రతి అల్ప విషయమును వారే తీర్చవచ్చును. అట్లు వారు నీతో కూడ ఈ భారమును మోసినయెడల నీకు సుళువుగా ఉండును. [23]దేవుడు ఈలాగు చేయుటకు నీకు సెలవిచ్చినయెడల నీవు ఈ పని చేయుచు దాని భారమును సహింపగలవు. మరియు ఈ ప్రజలందరు తమ తమ చోట్లకు సమాధానముగా వెళ్లుదురని చెప్పెను. [24]మోషే తన మామ మాట విని అతడు చెప్పినదంతయు చేసెను. [25]ఇశ్రాయేలీయులందరిలో సామర్థ్యముగల మనుష్యులను ఏర్పరచుకొని, వేయిమందికి ఒకనిగాను, నూరుమందికి ఒకనిగాను, ఏబదిమందికి ఒకనిగాను, పదిమందికి ఒకనిగాను, న్యాయాధిపతులను ఏర్పాటు చేసి వారిని ప్రజలమీద ప్రధానులనుగా నియమించెను. [26]వారెల్లప్పుడును ప్రజలకు న్యాయము తీర్చువారు. వారు కఠిన వ్యాజ్యెములను మోషే యొద్దకు తెచ్చుచు, స్వల్ప వ్యాజ్యెములను తామే తీర్చుచువచ్చిరి. [27]తరువాత మోషే తన మామను పంపివేయగా అతడు తన స్వదేశమునకు వెళ్లెను.**

**వచనములు 13, 14.** పెద్దలతో కలిసి అతడు భోజనము చేసిన **మరునాడు,** యిత్రో ఇశ్రాయేలు యొక్క న్యాయ వ్యవస్థ యొక్క కార్యకలాపాలను చూశాడు. **ప్రజలు** మోషే యెదుట కనబడుటకు తమ వంతు కొరకు ఎదురుచూస్తూ **నిలిచియుండగా మోషే** ఎవరి సహాయము లేకుండ ఒక్కడే **ప్రజలకు న్యాయము తీర్చుటకు కూర్చొని యుండెను.** మోషే తీర్పుతీర్చుట అనగా, "ఈ సందర్భంలో 'దేవుని ఆజ్ఞలు మరియు నియమాల' ఆధారంగా కొన్ని పక్షముల మధ్య న్యాయ సమస్యలను తీర్చుట (వ. 16)."[14] వ్యవస్థ అభివృద్ధి చెందాలని యిత్రో కనుగొన్నాడు. వారిలో కొందరు తమ విజ్ఞాపనలను చేయుటకు రోజంతా వేచియుండవలసి వచ్చినంతగా అతడు **ఒంటరిగా ప్రజలకు** న్యాయము **ఎందుకు** తీర్చాడని మోషేను అడుగుట అభివృద్ధి వైపుకు మొదటి మెట్టు.

**వచనములు 15, 16.** అతడు దేవుని ప్రతినిధిగా ఎన్నుకొనబడెనని **మోషే**

జవాబిచ్చాడు. కాబట్టి, ఏ విషయమును గూర్చియైనా దేవుని చిత్తమును తెలుసుకొనుటకు ప్రజలు నా యొద్దకు రావాలి. మోషే యొద్ద విచారణ చేయుట అంటే **దేవుని యొద్ద విచారణ చేయుట**. ప్రజలలో ఒకరితో ఒకరికి బేధము ఉన్న యెడల, వారిలో ఎవరు సరైనవారో నిర్ధారించు శక్తి మోషేకు ఉంది. ఏదో ఒక ప్రత్యక్షతతో దేవుడు అప్పటికే మోషేకూ జవాబు ఇవ్వని పక్షాన, మోషే దేవుని అడిగేవాడు మరియు దేవుడు అతనికి జవాబు ఇచ్చేవాడు. దేవుని కట్టడలను ఆయన ధర్మశాస్త్ర విధులను ఇశ్రాయేలీయులకు తెలియజేస్తు మోషే తన బాధ్యతలు నెరవేర్చాడు.

**వచనములు 17, 18. నీవు చేయుచున్నది మంచిపని కాదు** అని యిత్రో ప్రత్యుత్తరము ఇచ్చాడు. అంత పెద్ద పనిని మోషే ఒంటరిగా చేయుట కష్టము కాబట్టి మరియు వారి వ్యాజ్యెములను చెప్పుకొనుటకు ప్రజలు **గంటలు తరబడి వేచియుండుట కష్టము కాబట్టి** వ్యవస్థ అభివృద్ధి చెందవలసియుంది.

**వచనములు 19, 20.** అందువలన, మోషే తన బాధ్యతలను మరింత ఆలోచనపూర్వకంగా నెరవేర్చాలని యిత్రో సూచించాడు. అతడు రెండు సలహాలు ఇచ్చాడు. మొదటిగా, **ప్రజల పక్షమున దేవుని సముఖమందు ఉండుము** అని చెప్పాడు. ప్రార్ధనలో, మోషే వారి సమస్యలు మరియు **వ్యాజ్యెములను** దేవుని యొద్దకు తీసుకొనిరావచ్చు. రెండవదిగా, "ప్రజల ఎదుట దేవుని ప్రతినిధిగా ఉండుము" అని చెప్పాడు. మోషే **వారికి ఆయన కట్టడలను ధర్మశాస్త్ర విధులను బోధించి, వారు నడవవలసిన త్రోవను వారు చేయవలసిన కార్యములను వారికి తెలుపవచ్చు.**

**వచనము 21.** ప్రజలపైన అధికారులను నియమించి అనుదిన వ్యాజ్యెములను తీర్చు బాధ్యత వారికి అప్పగించమని యిత్రో మోషేకు సలహా ఇచ్చాడు. అదే విధంగా, ఇశ్రాయేలులో కూడా ఉన్నత న్యాయస్థానం మరియు క్రింద న్యాయస్థానం ఉండాలి, ఎందుకంటే నియమింపబడిన పురుషులు **వేయిమందికి, నూరుమందికి, ఏబదిమందికి, పదిమందికి** పైన నియమింపబడాలి.

వీరు ఆ పనికి అర్హులుగా ఉండాలి. వారు **సామర్థ్యము కలిగి, దైవభక్తి** మరియు జ్ఞానము కలిగినవారిగా ఉండాలి. అట్టి నాయకులు కావాలని ఎప్పుడు ఎవ్వరికి న్యాయము చేయరు. **సత్యాసక్తి** కలిగిన వారిగా, వారు ఒక వ్యాజ్యెమును వినుచున్నప్పుడు దేవుని చిత్తమును కోరతారు. **లంచగొండులుకానివారిగా** వారు లంచములకు లొంగిపోరు.

**వచనములు 22, 23.** నియమింపబడిన ఈ మనుష్యులు **అల్ప విషయములు** అని వర్గీకరించబడిన వాటన్నిటిలో మోషే స్థానమును తీసుకోవాలి. అయితే **గొప్ప వ్యాజ్యెము** వచ్చినప్పుడు, తీర్పు కొరకు దానిని మోషే యొద్దకు తేవాలి. తన భారములను ఇతరులతో పంచుకొను వ్యవస్థ ద్వారా మోషే పని సుళువు అవుతుంది, మరియు మోషే దానిని **సహింపగలడు.** దీనికి తోడు, ఈ నూతన వ్యవస్థ **ప్రజలకు** సహాయం చేస్తుంది, వారి వ్యాజ్యెములు సమయానుకూలంగా తీర్చబడి, ప్రజలు **తమ తమ చోట్లకు సమాధానముగా వెళ్తారు.** మోషే దగ్గర గంటల కొలది వేచియున్నప్పుడు వారు కలిగియున్న సణుగులాటకు బదులుగా వారు సంతృప్తితో ఇంటికి వెళ్తారు.

ఈ సలహా యిత్రో ఇచ్చినప్పటికీ, **దేవుడు** ఈలాగు చేయుటకు మోషేకు

సెలవిచ్చినయెడల మాత్రమే మోషే అలా చెయ్యాలని యిత్రో కోరాడు.[15] కాబట్టి, ఈ నూతన వ్యవస్థకు దేవుని అంగీకారం కూడా ఉండియుంటుంది (చూడండి సంఖ్యా. 11:16, 17, 24, 25 చూడండి).

**వచనములు 24-26. మోషేకు** గౌరవం తెచ్చునట్లు, అతడు **తన మామ మాట విని అతడు చెప్పినదంతయు చేసెను** (18:17-23). అతడు చాలా సులువుగా ఇలా వాదించియుండవచ్చు: "ఇశ్రాయేలీయులకు నేను నాయకుడను. నేను దేవునితో మాట్లాడాను, ఆయన తన చిత్తమును నాకు చెప్పాడు. నేను ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి బయటకు తెచ్చాను, మరియు ఏమి చెయ్యాలో నాకు తెలుసు. నేను ఏమి చెయ్యాలో నాకు చెప్పగలిగిన ఈ మిద్యానీయుడు ఎవడు?" ఇతరుల సలహాలను అంగీకరించుటకు మోషే చూపిన సముఖత అతని వినయమునకు నిదర్శనంగా ఉంది (సంఖ్యా. 12:3 చూడండి).

ఇశ్రాయేలు యొక్క న్యాయ వ్యవస్థ ఒక అన్యుడైన, మిద్యాను యాజకుడైన యిత్రో ఇచ్చిన సలహా ద్వారా ఆరంభమైయ్యింది అను విషయం ఈ కథనములో ఒక గుర్తింపదగిన విషయం.[16] ఏ ఇశ్రాయేలు రచయిత కూడా అట్టి కథను కల్పించి వ్రాసేవాడు కాదు; ఈ సన్నివేశం నిజంగా జరిగింది అనేదే పంచకాండములో దీనిని జోడించుటకు ఒకే ఒక్క వివరణ.

**వచనం 27.** యిత్రో ఈ సలహా ఇచ్చిన తరువాత మరియు అది అంగీకరించబడిన తరువాత, **మోషే తన మామను పంపివేశాడు.** యిత్రో మిద్యానుకు తిరిగివెళ్లాడు.

సీనాయి యొద్ద ఒక సంవత్సరము గడచిన తరువాత వారు పర్వతమును విడచి కానానుకు వెళ్లుటకు సిద్ధపడినప్పుడు, "మోషే మామయగు మిద్యానీయుడైన రెవూయేలు కుమారుడగు హోబాబు" ఇశ్రాయేలుతో ఉన్నాడని సంఖ్యాకాండము 10 సూచిస్తుంది. మోషే తన బావయైన హోబాబును ఇశ్రాయేలీయులతో ప్రయాణములో రమ్మని ఆహ్వానించాడు (సంఖ్యా. 10:29). అతడు మొదట నిరాకరించి తన స్వదేశమునకు వెళ్లాలని ఆశించాడుగాని, అతనికి ఆ ప్రదేశము తెలుసు కాబట్టి వారికి "కన్నులు"గా ఉండమని మోషే వేడుకొన్నాడు. వాస్తవానికి, దేవుడు ఇశ్రాయేలుకు మేలు చేసిన విధంగానే హోబాబుకు కూడా మేలు చేస్తాడని మోషే వాగ్దానం చేశాడు (సంఖ్యా. 10:30-32). మోషే చేసిన విజ్ఞాపనను హోబాబు అంగీకరించాడో లేదో లేఖనము చెప్పుటలేదుగాని, కొందరు కయీనీయులు కనానులో ఇశ్రాయేలీయులతో నివాసమున్నారు (న్యాయాధి. 1:16; 4:11; 1 సమూ. 15:6; 27:10).[17]

సంఖ్యా. 10 మరియు నిర్గమ. 18 ఒకే సన్నివేశమును గూర్చి చెబుతున్నాయని కొందరు వ్యాఖ్యానకర్తలు ఊహిస్తారు.[18] అది సాధ్యమైనప్పటికీ, ఇవి రెండు వేర్వేరు సన్నివేశాలు అయ్యుండవచ్చు. యిత్రో ముందు మిద్యానుకు వెళ్లి సీనాయి యొద్ద హోబాబును ఇశ్రాయేలుతో విడిచిపెట్టగా, మరియు అతడు ఇశ్రాయేలీయులు కనానుకు వెళ్లుటకు బయలుదేరునంత వరకు వారితో ఉండుట ఒక సాధ్యత కావచ్చు.

# అన్వయము

## యిత్రో: ఊహించని స్థలములలో సహాయం (అధ్యా. 18)

మీకు ఎప్పుడైనా ఊహించని స్థలాలలో ఆశ్చర్యకరమైన మూలముల నుండి సహాయం దొరికిందా? మీరొక క్రొత్త నగరంలో, దారితప్పి, ఏమి చెయ్యాలో తెలియని పరిస్థితిలో ఉండగా, మీరు మునుపెన్నడూ చూడని ఒకరు మీకు సహాయం చేయుటకు ఆగియుండవచ్చు. మీ పైన అబద్ధ నింద పడగా, అందరు మీకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నప్పుడు, మీరు శత్రువని తలంచుచున్న ఒకడు నిజము చెప్పి మిమ్మును తప్పించియుండవచ్చు. యిత్రో ద్వారా మోషే ఒక క్రొత్త స్థలములో అనగా మిద్యానులో అన్యుని ద్వారా సహాయం పొందాడు.

*మోషేకు ఇల్లు లేనప్పుడు అతడు ఆయనకు ఇల్లు ఇచ్చాడు.* మోషే ఐగుప్తీయుని చంపి పాతిపెట్టి ఐగుప్తును విడచి పారిపోయినప్పుడు అతడు ఇల్లు లేనివానిగాను ఒంటరిగాను ఉన్నాడు. దేవుని దైవకృతం ద్వారా, యిత్రో కుమార్తెలు మందలకు నీళ్లు పెట్టుటకు వాటిని బావి యొద్దకు తోడుకొనివచ్చినప్పుడు మోషే వారికి సహాయం చేశాడు. దానికి బదులుగా యిత్రో మోషేకు ఆతిథ్యమిచ్చాడు. తుదకు, తన కుమార్తెను మోషేకు భార్యగా ఇచ్చి, మోషేతో తన ఇంటిని పంచుకొని, మోషేకు గొర్రెల కాపరిగా ఉద్యోగమిచ్చి, తన సొంత కుమారుని వలె మోషేతో వ్యవహరించాడు.

*మోషే తన కుటుంబమును పోషించలేని సమయంలో అతడు మోషే కుటుంబమును పోషించాడు.* మోషేను కలుసుకొనుటకు యిత్రో సీనాయి పర్వతము యొద్దకు వచ్చినప్పుడు, మోషే భార్యను ఇరువురు కుమారులను వెంట తీసుకొనివచ్చాడు (18:1-4). మోషే మిద్యానును విడిచిపెట్టిన తరువాత ఆమె కాపుదల కొరకు ఆమెను మరలా తిరిగి పంపించియుంటాడు. వారు మరలా మోషేను కలిసేంత వరకు యిత్రో సిప్పోరాను మరియు పిల్లలను పోషించాడు.

*తన సొంత ప్రజలు కూడా మోషేను నిరుత్సాహపరచినప్పుడు అతడు మోషేను ప్రోత్సహించాడు.* యిత్రో మోషే యొద్దకు వెళ్లినప్పుడు, ఇశ్రాయేలును ఐగుప్తు నుండి బయటకు తెచ్చుటకు దేవుడు చేసిన కార్యములను అతడు ముందుగానే విన్నాడు. "యెహోవా ఐగుప్తీయుల చేతిలోనుండి విడిపించి ఇశ్రాయేలీయులకు చేసిన మేలంతటిని గూర్చి అతడు సంతోషించెను" (18:9), యెహోవాను స్తుతించాడు (18:10, 11), మరియు దేవునికి బలులు అర్పించాడు (18:12). "దేవుని యెదుట" ఇశ్రాయేలు పెద్దలతో భోజనము చేయుట ద్వారా, యిత్రో తన ప్రజలను ఇశ్రాయేలు ప్రజలతో ఒక నిబంధనలో జతపరచాడు. అట్టి కఠినమైన అరణ్యములో మాట వినని ప్రజలకు నాయకత్వం వహిస్తూ భారమును అనుభవిస్తున్న మోషేకు, యిత్రో యొక్క క్రియలు ప్రోత్సాహకరముగా ఉండియుండాలి.

*మోషేకు అవసరమైనప్పుడు మంచి సలహా ఇచ్చాడు.* యిత్రో మోషే ఉపయోగిస్తున్న న్యాయ వ్యవస్థను చూసినప్పుడు దానిలో కొన్ని సమస్యలను కనుగొని మార్పులను సూచించాడు. మోషే స్వయంగా గొప్ప వ్యాజ్యెములను తీరుస్తూ,

అల్ప విషయములకు తీర్పు తీర్చుటకు అర్హులైన మనుష్యులను ఎన్నుకోవాలని ఆయన సలహా ఇచ్చాడు. మోషే యొక్క మంచితనం ద్వారా, అతడు తన మామ ఇచ్చిన సలహాను అంగీకరించాడు.

*ఇశ్రాయేలు అరణ్యములో సంచారము చేయుచుండగా అతడు వారికి మార్గదర్శిని ఇచ్చియుండవచ్చు.* యిత్రో కుమారుడైన హోబాబుకు మోషే మార్గదర్శిగా ఉండే పనిని అప్పగించాడని సంఖ్యా. 10:29-32 చెబుతుంది గాని, అతడు ఆ పనిని అంగీకరించాడో లేదో తెలియదు.

*ముగింపు.* మోషేకు అవసరమైనప్పుడు దేవుడు తన దైవకృతములతో యిత్రో ద్వారా సహాయం చేశాడు. దేవుడు ఏర్పరచుకొన్న ప్రజలకు సహాయం చేసిన అన్యులలో యిత్రోకు కూడా స్థానముంది. యెరికో పట్టణమునకు వెళ్లిన ఇశ్రాయేలు వేగులవారికి రాహాబు సహాయం చేసింది (యెహో. 2). రాజు దగ్గర ఉన్న స్త్రీలకు అధికారిగా ఉన్న హేగే ఎస్తేరు పట్ల దయచూపాడు (ఎస్తేరు 2:8, 9). "నపుంసకులకు అధిపతి" దానియేలునకు కృపాకటాక్షమును అనుగ్రహించాడు (దాని. 1:9).

దేవుని కార్యము కొరకు సహాయకులు కావాలి. ఇతరులు మిమ్ము́ను "గొప్పవారిగా" పరిగణించకపోవచ్చు, కాని "గొప్పవారికి" సహాయం చేయగల శక్తి మీలో ఉండవచ్చు. మీరు దావీదుకు సహాయం చేయు యోనాతాను కావచ్చు, పౌలుకు సహాయం చేయు బర్నబా కావచ్చు, పేతురును క్రీస్తు యొద్దకు తెచ్చు అంద్రెయ మీరు కావచ్చు, మోషే చేతులు ఎత్తిపట్టుకొని అహరోను లేక హూరు మీరు కావచ్చు, లేక ఒక నాయకునికి సహాయం అవసరమైనప్పుడు కావలసిన సహాయమును ఇచ్చు యిత్రో మీరు కావచ్చు.

దేవుని ప్రజలకు సహాయం ఊహించని స్థలముల నుండి వస్తుందని మనకు తెలియాలి. మరియు, ఇతరులకు కావలసిన సహాయం మనం చేయగలిగిన సమయంలో చేయుట మన బాధ్యత అని కూడా మనం గుర్తించాలి.

## క్రమమును పొందుట (అధ్యా. 18)

మన స్థానిక సంఘములో దేవుని పని చేయుటకుగాను ఒక క్రమమును పొందుటను గూర్చి నిర్గమ 18 అనేక నియమాలను నేర్పిస్తుంది. (1) మోషే యిత్రో మాటలు విని ఆయన సలహాను పాటించాడు. అదే విధంగా నాయకులు ఇతరుల సలహాలను విని, అవి ఊహించని మూలముల నుండి వచ్చినప్పటికి కూడా, వాటిని అంగీకరించాలి. (2) యిత్రో మరియు ఇశ్రాయేలు నాయకులు ఒక నిబంధనను చేశారు. అదే విధంగా, సంఘ నాయకులు కూడా తమ ఉద్దేశములను నెరవేర్చుటకు సహాయపడు ఇతరులతో భాగస్వామ్యం చెయ్యాలి. (3) తాను చేయుటకు విశేషంగా అర్హత పొందిన దానిపై మోషే దృష్టి ఉంచాలని ఆయనకు చెప్పబడింది. అదే విధంగా నేటి నాయకులు కూడా, దేవుడు వారికిచ్చిన తలాంతులను ఉపయోగించుటకు ఎక్కువ సమయమును మరియు కృషిని ఉపయోగించాలి. (4) అల్ప విషయములను కుదుర్చుటకు మోషే బాధ్యతను ఇతరులకు అప్పగించాడు. అలాగే, నేటి నాయకులు కూడా బాధ్యతలను పంచుట నేర్చుకోవాలి. (5) మోషే బాధ్యతలను ఇచ్చిన వారు

ముఖ్యముగా అర్హులైనవారిగా ఉండవలసియుంది. అలాగే, నేటి సంఘు నాయకులు బాధ్యతలు ఇచ్చు వారు కూడా వాటిని చేయుటకు అర్హులుగా ఉండాలి. ఇవే నాయకత్వ నియమాలను గూర్చి క్రొత్త నిబంధన ఉదాహరణల కొరకు, అపొ. 6:1-7 చూడండి.

## యిత్రో, ఒక మంచి మనిషి (అధ్యా. 18)

మోషే మామ కలిగియున్న అనేక గుణాలు నేడు మనం పాటించవచ్చు.[19] యిత్రో ఈ క్రింది వాటిని చేశాడు:

1. "దేవుని గూర్చి అతని ప్రజలను గూర్చి సమాచారమును చెప్పుట" (18:1)
2. "మోషే తన భార్య పిల్లలను గూర్చి చేసిన న్యాయమైన దావాలను గుర్తించాడు" (18:2-4)
3. "మర్యాదగా ప్రవర్తించాడు" (18:5-8)
4. "ఇతరుల ఆశీర్వాదములలో సంతోషించాడు" (18:9)
5. "దేవుని స్తుతించాడు" (18:10, 11)
6. "ఆరాధించాడు" (18:12)
7. "మంచి సలహా ఇచ్చాడు" (18:13-22)
8. "దేవుని అంతిమ అన్నిటికంటే పై అధికారమును గుర్తించాడు" (18:23).

## మోషే కుమారుల యొక్క పేర్లు (18:3, 4)

మోషే ఇద్దరు కుమారులకు "గేర్షోము," అనగా "పరదేశి"గా ఉండుట, మరియు "ఎలీయెజెరు," అనగా "దేవుడు నాకు సహాయము," అని పేర్లు పెట్టబడినవి. ఈ రెండు పేర్లు మిద్యానులో మోషే పరిస్థితిని చక్కగా వర్ణిస్తాయి. అతడు పరదేశంలో "పరదేశి"గా ఉన్నాడు, మరియు ఫరో చేతి నుండి అతనిని విడిపించుట ద్వారా దేవుడు మోషేకు సహాయం చేశాడు. క్రైస్తవులు కూడా ఈ లోకములో "పరదేశులు" (1 పేతురు 2:11). మనం కూడా దేవుని ద్వారా మరణము నుండి విడిపించబడితిమి.

## "మంచివి కాని" విషయములు కాని పాపములు కాదు (18:17)

"నీవు చేయుచున్న పని మంచిది కాదు" అని యిత్రో చెప్పినప్పుడు, మోషే యొక్క నాయకత్వ పద్ధతి తప్పని లేక పాపమని ఆయన అర్థం కాదు. అయితే, అది ప్రభావ రహితముగాను శక్తిలేనిదిగాను ఉన్నది కాబట్టి అది మంచిది కాదు. మనం చేయు కొన్ని పనులు పాపములు కానప్పటికీ, అవి సరైన ఫలితాలను తెచ్చుటలేదు కాబట్టి అవి "మంచివి కావని" మనం ఒప్పుకోవాలి. ఉదాహరణకు, "వెళ్లి . . . ప్రకటించుడి" (మార్కు 16:15) అను దేవుని ఆజ్ఞను పాటించిన ఒక క్రైస్తవుడు వేరొక ఖండమునకు వెళ్లాలని తలంచి విమానం ద్వారా, ఓడ ద్వారా, లేక వాహనం ద్వారా వెళ్లుటకు బదులుగా నడచి వెళ్లుటను ఊహించుకోండి. ఆ ప్రయాణ మార్గము

అవశ్యకమైనది కాదు. మనం ఎల్లప్పుడు లేఖనమును పాటించాలని క్రొత్త నిబంధన చెబుతుందిగాని, మనకు అందుబాటులో ఉన్న సాధనములు కూడా ఉపయోగించమని అది బోధిస్తుంది. దేవుని సంఘమును కట్టునప్పుడు - ప్రభావవంతమైన మార్గములను ఉపయోగించుటకు - మనం వివేకముతో ఉండాలి (1 కొరింథీ. 3:10). అలాగే ఇతరులకు సువార్త ప్రకటించునప్పుడు మనం జాగ్రత్తగా వివేకముతో కూడా మాట్లాడాలని ఆయన మనలను కోరాడు (కొలస్సి. 4:5 చూడండి). ఫలబరితముకాని పద్ధతులను ఉపయోగించుట లేక సిద్ధపడకుండా మాట్లాడుట పాపము కాదు; కాని అది శక్తి లేనిదిగాను ప్రభావ రహితముగాను ఉంటుంది కాబట్టి, "మంచిది కాదు."

---

సూచనలు

[1]R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973), 137, 142. [2]"న్యాయ వ్యవస్థ యొక్క స్థాపనను గూర్చి ద్వితీయోపదేశకాండము 1వ అధ్యాయములో ఇవ్వబడిన సమాంతర వాక్యభాగ ఆధారంగా సీనాయి అని పిలువబడు హోరేబు యొద్ద వారి నివాసం యొక్క చివరి దినాలలో దాని యొక్క పునఃక్రమబద్ధీకరణ జరిగినట్లు సూచించబడింది" అని Nahum M. Sarna చెబుతున్నాడు. (Nahum M. Sarna, *Exploring Exodus: The Origins of Biblical Israel* [New York: Schocken Books, 1996], 127.) [3]Ibid., 128-29. [4]James Burton Coffman, *Commentary on Exodus, The Second Book of Moses* (Abilene, Tex.: ACU Press, 1985), 247. ఈ ఆలోచనకు మద్దతు ఈ పుస్తకంలో కూడా ఉంది, Peter Enns, *Exodus*, The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan, 2000), 371. [5]John I. Durham, *Exodus*, Word Biblical Commentary, vol. 3 (Waco, Tex.: Word Books, 1987), 244. [6]Ibid., 239, 244. [7]W. H. Gispen, *Exodus*, trans. Ed van der Maas, Bible Student's Commentary (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1982), 174. [8]Durham, 245. [9]మోషే యొక్క ధర్మశాస్త్రము అప్పటికి ఇవ్వబడలేదు కాబట్టి, మెల్కీసెదకు వలె దేవునికి బలులు అర్పించు హక్కు యిత్రోకు కూడా ఉంది అని Coffman వాదించాడు. (Coffman, 244-46.) [10]John H. Walton and Victor H. Matthews, *Genesis-Deuteronomy*, The IVP Bible Background Commentary (Downers Grove, Ill.: InterVarsity Press, 1997), 104-5.

[11]ఈ సందర్భంలో యిత్రో యెహోవా ఆరాధనలోనికి మారాడని కొందరు నమ్ముతారు. (Coffman, 245.) [12]Durham, 245. [13]Sarna, 128-29. నిబంధన భోజనములను గూర్చి ఇతర ఉదాహరణల కొరకు, చూడండి ఆది. 26:30; 31:54. [14]Enns, 371. [15]Coffman, 249. [16]Sarna, 127. [17]Cole, 142. [18]Sarna, 128. [19]Wilbur Fields, *Exploring Exodus*, Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1976), 376-77.